ఆర్‌అండ్‌బీ పనులా.. మాకొద్దు బాబోయ్!

- రోడ్ల మరమ్మతులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ల విముఖత
- బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడమే కారణం
- ఇప్పటికే పెండింగ్‌లో రూ.800 కోట్లకుపైగా బిల్లులు
- జిల్లాల్లో అధ్వానంగా రోడ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రోడ్లు భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ)కు చెందిన పనులను చేపట్టేందుకు గతంలో కాంట్రాక్టర్లు తీవ్రంగా పోటీపడేవారు. తక్కువ ధరకు టెండర్ కోట్‌చేసి పనులను దక్కించుకునేవారు. కానీ, ఇటీవల పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆర్‌అండ్‌బీ శాఖ పనులను చేపట్టేందుకు ఏజెన్సీలు ముఖం చాటేస్తున్నాయి. అనేకసార్లు రీటెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. నాలుగైదు నెలల నుంచి ప్రభుత్వం ఎన్నో బిల్లులను పెండింగ్‌లో పెట్టడమే ఇందుకు కారణమని అధికార వర్గాలు చెప్తున్నాయి. ప్రధాన రహదారులతో పాటు వివిధ జిల్లాలు, మండల కేంద్రాలను అనుసంధానించే రోడ్లను నిర్వహించడం ఆర్‌అండ్‌బీ శాఖ బాధ్యత. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోడ్ల మరమ్మతులు పూర్తిగా నిలిచిపోయాయి. మరమ్మతులు చేపట్టే కాంట్రాక్టర్లలో ఎక్కువ మంది చిన్న కాంట్రాక్టర్లే. పూర్తి చేసిన పనికి బిల్లు చెల్లిస్తేనే మరో పనిని చేపట్టగలిగే వారికి బిల్లుల చెల్లింపు నిలిచిపోవడంతో కొత్త పనులు చేపట్టేందుకు ముందుకు రావడంలేదు. ఐదు నెలలుగా రూ.800 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో పురోగతిలో ఉన్న పనులను కూడా కాంట్రాక్టర్లు నిలిపివేశారని అధికారులు చెప్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే వర్షాకాలంలో రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతుందని స్పష్టం చేస్తున్నారు.

రూ.1,200 కోట్ల పనులకు చెల్లించింది రూ.400 కోట్లే

రాష్ట్రంలోని పాత ఆర్‌అండ్‌బీ సర్కిళ్ల పరిధిలో రోడ్ల మరమ్మతులకు సంబంధించిన 1,170 పనుల కోసం నిరుడు మార్చిలో కేసీఆర్ ప్రభుత్వం రూ.2,500 కోట్లు మంజూరు చేసింది.దాదాపు 591 పనులు పూర్తయ్యాయి. మరో 450 పురోగతిలో, మిగిలిన 129 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంతలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో కొత్త టెండర్ల ప్రక్రియను నిలిపివేశారు. ఇప్పటివరకు రూ.1,200 కోట్ల విలువైన పనులు పూర్తవడంతో ఎన్నికల నాటికే దాదాపు రూ.400 కోట్ల చెల్లింపులు జరిగాయని, మిగిలిన రూ.800 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు.

దేశ భవిష్యత్తును ఊహించిన దార్శనికుడు అంబేద్కర్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతిని (ఏప్రిల్ 14వ తేదీ) పురస్కరించుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు పాటుపడిన మహనీయుడు అంబేద్కర్ అని సీఎం కొనియాడారు. దేశ భవిష్యత్తును ముందుగానే ఊహించి దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగమే తెలంగాణ రాష్ట్రానికి జీవం పోసిందని గుర్తు చేసుకున్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతుందని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో అడుగులు వేస్తుందని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పూల రవీందర్ కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో రవీందర్‌తో పాటు పీఆర్టీయూ టీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పూల రవీందర్ మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం నూతన ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా మొదటి తేదీనే వేతనాలు అందిస్తున్నందుకు ముఖ్య మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు, ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు రాష్ట్రానికి కేసీ వేణుగోపాల్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : ఎంపీ ఎన్నికల సందర్భంగా ప్రజల్లో రోజురోజుకూ ఆసక్తి సన్నగిల్లుతూ.. ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం అలర్ట్ అయింది. దీంతో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నేడు రాష్ట్రానికి విచ్చేసి ఆ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, పార్టీ అభ్యర్థులు, ఇప్పటికే నియమితులైన ఇన్‌చార్జిల పనితీరు, కొనసాగుతున్న ప్రచార సరళిని సమీక్షించనున్నట్టు సమాచారం.

'వందే భారత్'పై రాళ్ల దాడి

న్యూఢిల్లీ : 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' రైళ్లపై రాళ్ల దాడులు కొనసాగుతున్నాయి. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ – గయ రైల్వే సెక్షన్‌లోని కర్వాండియా రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం వందే భారత్ రైలుపై రాళ్ల దాడి జరిగింది. బనారస్ నుంచి రాంచీ వెళ్తుండగా, ససారం రైల్వే స్టేషన్ సమీపంలో ఈ రైలుపై కొందరు వ్యక్తులు రాళ్లు రువ్వారు. ఓ రాయి సీ7 బోగీ కిటికీకి బలంగా తగలడంతో అద్దాలు పగిలిపోయాయి. భారీ శబ్దం వినిపించడంతో ఓ ప్రయాణికుడు రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. ససారం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మీడియాతో మాట్లాడుతున్న మాధవరావు కుటుంబ సభ్యులు

కేసు ఎత్తివేయకుంటే ఆత్మహత్యే

- ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇంటి ఎదుటే చచ్చిపోతాం
- బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి సల్వాజీ మాధవరావు కుటుంబ సభ్యుల ప్రకటన

ధర్మారం, ఏప్రిల్ 13: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి సల్వాజీ మాధవరావుపై కాంగ్రెస్ నాయకులు పెట్టిన అట్రాసిటీ కేసును ఎత్తివేయకపోతే తమకు ఆత్మహత్యే శరణ్యమని, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇంటి ఎదుటే చచ్చిపోతామని ఆయన కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. రెండ్రోజుల కింద మాధరావును అట్రాసిటీ కేసులో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో శనివారం మాధవరావు తల్లిదండ్రులు సల్వాజీ మారుతీరావు, రాజవ్వ, అతని సోదరి మాధవి ధర్మారంలో మీడియాతో మాట్లాడారు. మాధవరావు అధికార పార్టీని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులు కక్షగట్టి గత నెలలో తీవ్రంగా దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పుడు లేని విషయాన్ని సృష్టించి, కాంగ్రెస్ యూత్ నాయకుడిని ఎస్సీ కులం పేరిట దూషించాడని అక్రమంగా కేసు నమోదు చేయించి అరెస్ట్ చేయించారని, ఇది ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ పనేనని పేర్కొన్నారు. తమ కొడుకుపై కేసును ఎత్తివేసి జైలు నుంచి విడుదల చేయించాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. శనివారం పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మాధవరావు తల్లిదండ్రులను బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. పార్టీపరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మాధవరావుపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై ఎందుకు కేసు నమోదు చేయలేదని పోలీసులను ప్రశ్నించారు.

కేఆర్ఎంబీ బడ్జెట్‌పై 22న సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) నిర్వహణకు నిధులు కరువయ్యాయి. బోర్డు ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో బడ్జెట్ విడుదలకు సంబంధించి ఇరు రాష్ట్రాలతో 22వ తేదీన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

ఫైర్ డీజీ నాగిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఫైర్ డీజీ వై నాగిరెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ పట్టినాగులపల్లిలోని స్టేట్ ఫైర్ ట్రైనింగ్ స్కూల్‌లో ఆదివారం అమరులకు నివాళులర్పించి ఈ వారోత్సవాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఫైర్ స్టేషన్ల పరిధిలోని ప్రజలకు తమ సిబ్బంది అవగాహన కల్పిస్తారని చెప్పారు.

వివేక్‌ది అసలు దళిత కుటుంబమే కాదు

నిరూపించేందుకు నేను సిద్ధం • బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్

మంచిర్యాల, ఏప్రిల్ 13 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఆయన కుటుంబం అసలు దళితులే కారని పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. ఈ విషయాన్ని నిరూపించేందుకు తాను సిద్ధమంటూ సవాల్ విసిరారు. శనివారం ఆయన మంచిర్యాలలో మీడియాతో మాట్లాడారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీ దళితుడు ఎలా అవుతాడో వివేక్ చెప్పాలని ప్రశ్నించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ బిడ్డలుగా ఈ విషయంలో మాట్లాడేందుకు తమకు వందశాతం హక్కు ఉన్నదని అన్నారు. వివేక్ భార్య బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారని, ఆమె కుమారుడు వంశీ దళితుడు కాదని ఆయన పేర్కొన్నారు. తనపై ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా వివేక్, వంశీ నకిలీ దళితులు అని నిరూపించి తీరుతానని ఆయన స్పష్టం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో వివేక్ కుటుంబం కారణంగా మూడు కులాలకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యే టికెట్ అన్నదమ్ములు తీసుకొని, పెద్దపల్లి ఎంపీ టికెట్ కొడుక్కి ఇప్పించుకోవడంతో స్థానికంగా ఉండే మాదిగలు, నేతకాని, మాల సోదరులకు రాజకీయంగా అన్యాయం జరిగిందని అన్నారు. ఈ మూడు కులాల వారిని కలుపుకొని సామాజిక రాజకీయ ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. వెంకటస్వామి ఉన్నప్పటి నుంచి మాదిగలకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ, బీ, సీ, డీ వర్గీకరణకు 30 ఏండ్లుగా అడ్డుపడుతున్నది వెంటకస్వామి కుటుంబమేనని ఆరోపించారు. కుటుంబ పాలనకు తాము వ్యతిరేకమని పేర్కొన్నారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజా కోర్టులో శిక్ష తప్పదని శ్రీనివాస్ హెచ్చరించారు.

సుపరిపాలన కాదు.. సుపారీ పాలన

- హామీల అమలులో కాంగ్రెస్ ఘోరంగా విఫలం
- రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీది సుపరిపాలన కాదని, సుపారీ పాలన అని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి రాణీరుద్రమ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆమె రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పాకిస్థాన్ డీఎన్ఏ అని, ఆ పార్టీ 40 సీట్లు కాపాడుకుంటే చాలని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని, ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ నేడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమని విరుచుకుపడ్డారు. జాతీయ రాజకీయాలపై సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదని, అందుకే బీఆర్ఎస్‌కు బీజేపీ సుపారీ ఇచ్చిందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు రూ.15 వేలు, వడ్లకు బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం ఎప్పుడిస్తారో చెప్పాలని రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచకపాలన

- విప్లవపోరాటాలపై హింసాకాండను వ్యతిరేకించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 15న బంద్‌కు పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో విప్లవ పోరాటాలపై కాంగ్రెస్ కొనసాగిస్తున్న హింసాకాండను వ్యతిరేకించాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ బహిరంగ లేఖలో పిలుపునిచ్చారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో గ్రేహౌండ్స్ పోలీసులు చేపట్టిన ఏకపక్ష దాడిని ఖండించాలని కోరారు. వారం రోజులుగా తమ కదలికలను గమనించిన గ్రేహౌండ్స్ బలగాలు ఈ నెల 5న వెంకటాపూర్ మండల పరిధిలోని అడవిలోకి ప్రవేశించి 6వ తేదీ తెల్లవారుజామున దాడి చేశాయని వెల్లడించారు. ఈ దాడిలో సంతోష్, మనీరామ్, లక్ష్మణ్ అమరులయ్యారని తెలిపారు. ఈ ఘటనకు కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు. కగార్ దాడిని నిరసిస్తూ ఈ నెల 15న బంద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు.